# పథవిహీన

## అత్తిలి వెంకటరత్నం

రైలు ఒక్క కుదుపుతో ఆగింది.

ఒక క్షణం కంపార్ట్‌మెంట్ అటూ యిటూ ఊయ్యాలూగి నిలిచిపోయింది కీచుమని శబ్దం చేసుకుంటూ. యింజన్ హెచ్చరికగా రెండుసార్లు కూసి విసుగెత్తి ఊరుకుంది.

చలపతి చదువుతున్న పేపరు మడిచి కిటికీలో నుంచి బయటకు చూసాడు. చుట్టూ పచ్చని పైరులు కనులకి ఆహ్లాదం కలిగిస్తున్నాయి. సూర్యుడు సరిగా పశ్చిమ కనుమల వెనుకకి జారిపోతున్నాడు ఎర్రబారిపోయి. ఆకాశం ఒక మహోన్నత చిత్రకారుడి ఊహా కల్పనలాగ వింత వింత రంగులు సంతరించుకుంటోంది.

చలపతి దృష్టి కంపార్ట్‌మెంటు లోనికి మళ్లించాడు. అందరి ముఖాలలోను విసుగు చోటు చేసుకుంది. గమ్యం ఎప్పుడు చేరతామా అనే ఆత్రుత అందరి కనులలోను వ్యక్తం అవుతోంది.

అతని కనులు అకస్మాత్తుగా ఒకచోట నిలిచిపోయాయి.

'ఆమె నెప్పుడో చూసాను.' చలపతి మనసులో అనుకున్నాడు. 'ఎక్కడ? ఎప్పుడు?' మనసు ఊరికే గతం అంతా తడుముకుంటోంది. ఆమె కూడా ఒకసారి చలపతి వంక చూసి అతనూ సరిగా అప్పుడే చూస్తూ ఉండటం గమనించి చూపులు మరల్చుకుంది.

చలపతి సిగ్గుపడ్డాడు ఆమె యేమయినా అనుకుందేమోనని అంత తీక్షణంగా చూస్తూ ఉన్నందుకు. చేతిలో పేపరు తీసి చదువుతున్నట్లుగా ముఖానికి అడ్డుగా పెట్టుకున్నా— పేపరు పై అంచు మీదనుంచి ఆమె ముఖం స్పష్టంగా కనిపిస్తోంది. చలపతి తనను చూడటంలేదని నిశ్చయించుకున్న తరువాత రెండు మూడు సార్లు ఆమె కనులు అతని వైపు చూసాయి. చలపతి గమనించాడు. 'తనకి తప్పకుండా తెలిసిన వ్యక్తే అయివుండాలి. అనుమానం లేదు. ఎవరామె?' గాలికి చెవుల ముందు రేగిన జుట్టు వెనక్కి త్రోసుకుందామె చేతులతో.

'సత్యవతి!' చలపతి పెదవులు అస్పష్టంగా మెదిలాయి.

'సందేహం లేదు. ఆమే! సుమారు యిరవయి సంవత్సరాల తరువాత మళ్లా యీనాడు!' చలపతి యీసారి ధైర్యంగా ఆమె ముఖంలోకి చూసాడు.

ఆమె సీటుమీద వెనక్కి వ్రాలి కూర్చుంది. కూడా ఎవరూ ఉన్నట్లు లేరు. సామాను కూడా ఏమీ ఉన్నట్లు తోచదు ఒడిలో ఒక సంచీతప్ప. ఆమె కనులలో ఏదో నిర్లిప్తత, నిర్లక్ష్యం దోబూచులాడుతున్నాయి.

'ఏమని పలుకరించాలి? వివాహమయిందా మళ్లీ? జీవితంలో స్థిరపడగలిగిందా? ఏమో?' ఆమె గతం అంతా గుర్తుకివచ్చి చలపతి మనసులో ఒకేసారి అనేక సందేహాలు కలిగాయి. జీవితంలో మోసపోయింది. విధివంచిత!

'టికెట్ ప్లీజ్!' చలపతి ఆలోచనలకి మధ్యలో అంతరాయం కలిగింది. జేబులు తడుముకుని బయటకుతీసి చూపించాడు.

టికెట్ ఎగ్జామినర్ ముందుకి నడిచి ఆమె నడిగాడు.

ఒకక్షణం ఆమె చలపతివైపు చూసింది.

'లేదు. పోయింది.' ఆమె జవాబు విని చలపతి ఆశ్చర్యపోయాడు.

టికెట్ ఎగ్జామినర్ అనుమానంగా చూసాడు. 'డబ్బు కట్టవలసి ఉంటుంది.'

'నా దగ్గరలేదు.' ఆమె మళ్లీ చలపతి వంకచూసింది అంటూ.

కంపార్ట్‌మెంట్‌లో అందరిదృష్టిని ఆకర్షించింది విషయం. కొందరు సంభాషణ ఆపి ఆసక్తి చూపించారు.

'ఎక్సెస్ ఎంతవుతుందో చెప్పండి. నేను కడతాను.' చలపతి ముందుకివంగి అన్నాడు. టికెట్ ఎగ్జామినర్ ఆశ్చర్యంగా చూసాడు.

ఆమె పెదవులుసాగి చిన్నగా నవ్వాయి గుర్తుపట్టామంటూ. చలపతికూడా అప్రయత్నంగా నవ్వాడు.

ఇచ్చిన డబ్బుకి రసీదు చలపతి చేతిలో పెట్టి సాగిపోయాడు ఎగ్జామినరు.

'నువ్విపెట్టెలో ఎక్కినప్పుడే గుర్తుపట్టాను నేను.' ఆమె, సత్యవతి నవ్వుతూ అంది. ఆ నవ్వులో జీవంలేదనిపించింది చలపతికి.

'ఎక్కడినుంచి వస్తున్నావు?' చలపతి మామూలుగా అడిగినట్లుగా ఎంతో ప్రయత్నిస్తూ అన్నాడు.

'ఇప్పుడు ఆ మనిషికి చెప్పానుగా. అయినా ఆ రసీదుమీదే ఉంటుంది చూడు.' ఆమె అంది.

'నిజమే. ఇంతా అయినా ఆ సంగతి పట్టించుకోలేదు నేను.' చలపతి నవ్వుతూ అన్నాడు.

'చిన్నప్పుడు క్లాసులో పాఠాలు కూడా అలాగే వినేవాడివి.'

'అందుకే చివరకి యిలా అయ్యాను' చలపతి అన్నాడు.

సత్యవతి మళ్లీ ఏదో అడిగింది. చలపతికి వినపడలేదు. రైలు ప్లాట్‌ఫారం మీదకువచ్చి ఆగింది. చలపతి బయటకి చూసి కంగారుగా లేచాడు.

'ఎప్పుడయినా యీ ఊరులోదిగు యిటు వైపువస్తే. ఇక్కడే ఉద్యోగం. హెడ్మాష్టరు యిల్లెక్కడ? అంటే ఎవరయినా చూపిస్తారు.' చలపతి క్రిందకి దిగబోతూ అన్నాడు.

'ఇప్పుడు రమ్మని అనడానికి ధైర్యం సరిపోయిందేమిటి?' ఆమె కనులు నవ్వాయి.

చలపతి ఒకక్షణం ఆశ్చర్యపోయాడు. 'దిగుమరి! ట్రైను కదులుతుంది.' మనస్ఫూర్తిగా నవ్వుతూ అన్నాడు.

సత్యవతి చిన్న సంచితో రైలుదిగింది.

ఇద్దరూ బయటకు వదుస్తూ ఉండగా అంది 'ఏదో మాటవరసకి అంటే యిలా చేసిందని ఆశ్చర్యపోతున్నావా? చలపతీ!'

'నీమాట కొంతమాత్రం మారలేదు సత్యా!' ఒకక్షణం తొట్రుపాటుపడి 'సత్యవతీ!' అని పూర్తిచేసాడు చలపతి.

'చిన్నప్పటిలాగే పిలు. అప్పటికన్న పతనానికి దిగజారాను కాని గౌరవమేమీ పెరుగలేదులే.' సత్యవతి అంది.

బయట బాగా చీకటిపడిపోయింది. మబ్బులు ఆకాశాన్ని ఆవరించాయి. చిన్న చిన్న చినుకులు అక్కడా అక్కడా పడుతున్నాయి.

చలపతి ఎద్దుబండి మాట్లాడి సత్యవతిని ఎక్కించి తను రెండడుగులు వెనుకగా నడిచాడు.

'నీ రైలు టికట్ యిదిగో.' సత్యవతి చీకట్లో ఏదో విసిరేసింది.

'అదేమిటి?' చలపతి ఆశ్చర్యపోయాడు.

'పోలేదు. అబద్ధమాడాను నువ్వు నన్ను గుర్తుపట్టావో లేదో చూద్దామని ఒకవేళ గుర్తించినా ఎరుగనట్లు నటిస్తావేమోనని సందేహ నివృత్తికోసం. నువ్వే గెలిచావు.' విషాదంతో మిళితమయిన సత్యవతి నవ్వు బండి రొదలో కలిసిపోయింది.

'సామర్లకోట ఎందుకు?' చలపతి రెండువిముషాలు ఆగి అడిగాడు.

'ఎందుకంటే నాకే తెలియదు. అయినా ఎక్కడో అక్కడ బ్రతకాలి కదా!'

'అంటే అక్కడ ఎవరూలేరా?'

'ఉన్నారు. యీక్షణం నువ్వొక్కడివి యీమాత్రపు ఆప్యాయత నీ మనసులో నింపుకుని ఉన్నావు చలపతీ! మరెవ్వరూ లేరు. కాదు! నేనే మిగుల్చుకోలేకపోయాను.' ఆమె కంఠం విచారపుబరువుతో వణికింది.

చలపతి మాట్లాడలేకపోయాడు.

'వర్షం పెద్దదయింది. తడుస్తున్నావు. బండెక్కు.' సత్యవతి లోపలకి జరిగి కూర్చుంటూ అంది.


చలపతి చివరగా ఎక్కి సర్దుకుని కూర్చున్నాడు. చుట్టూ కటికచీకటి. బండికి కట్టిన గుడ్డిదీపం బ్రతుకలేని పేదవాడి జీవితంలా వెలుగుతోంది. బండి చక్రాల చప్పుడు మినహా అంతా నిశ్శబ్దంగా ఉంది.

'తరువాత ఏం జరిగింది? సత్యా!' చలపతి సందేహించి చివరకి అడిగేసాడు.

ఆమె వెంటనే మాట్లాడక పోయేసరికి అన్నాడు. 'నీకు బాధ కలిగేటట్లయితే వద్దు. నేను నిన్నేమీ అడగను.'

'లేదు చలపతీ! జరగడానికేముంది? నాకు తగిన శిక్ష లభించింది. సిగ్గు విడిచి మళ్లీ యింటికి చేరాను. నాన్న చనిపోయారు అప్పటికే నా మీద బెంగతో. అమ్మ నా ముఖం కూడా చూడనంది. అన్నయ్య...' సత్యవతి కంఠం జీరవోయి వాక్యం పూర్తి చేయలేక పోయింది.

'వద్దులే సత్యా! యింకేమీ చెప్పనవసరం లేదు. నేనర్థం చేసికోగలను.' చలపతి బాధగా అన్నాడు.



'...తరువాత ఎక్కడెక్కడో తిరిగాను నా ప్రాణం తీసుకునే ధైర్యంలేక. నీకు తెలిసి వదేగా నా చదువు కూడా అక్కడే ఆగి పోయింది. అన్నిరకాల వృత్తులు స్వీకరిం చాను. ఎప్పటికేది అవసరమయితే అది. కాని ఒకటి మాత్రం నిజం చలపతి! చెడిన ఆడదాన్ని యీ సంఘం తనలో చేర్చుకో లేదు...ఏకాకిగా జీవించనీయదు. నిలువనీడ లేకుండా విదిలించ బడ్డాను. ఒక్కటే ఆశ! మృత్యువు ఎంత త్వరలో తనలో చేర్చు కుంటుందా అని ఎదురు చూస్తున్నాను.' దీర్ఘంగా శ్వాసపీల్చి సత్యవతి ఆగింది.

చలపతికేమీ మాట్లాడటానికి తోచక ఊరుకున్నాడు. హృదయం జాలితో నిండి పోయింది.

బండి మలుపు తిరిగింది. దూరంగా ఊళ్లో లైట్లు వెలుగుతూ ఆరిపోతూ కనిపిస్తున్నాయి.

'చలపతీ! కనిపెంచిన కూతురు చని పోతే యేడవని తల్లెక్కడయినా ఉంటుందా చెప్పు. నేమా ఉన్నాను చూడు అది అమ్మా అమ్మా! అని చచ్చిపోతే నాకు యేడుపు రాలేదు చలపతీ! మనసులో యింకా సంతో షించానేమో యీ పాప ఫలం త్వరగా వదలి పోయిందని.' ఆమె చెక్కిళ్ల మీదుగా జారిన కన్నీరు చీకట్లో మెరిసింది.

చలపతికి ఆమె కన్నీరు తుడిచి ఓదార్చా లని అనిపించింది ఆ క్షణంలో. కాని అసమర్థుడు.. తను చేయలేడు.' దీర్ఘంగా నిట్టూర్చి ఊరుకున్నాడు.

బండి చక్రం ఒకవైపు గుంటలో దొర్లి పైకి లేచింది.

'ఎంతమంది పిల్లలు చలపతి?' ఆమె అడిగింది.

"ముగ్గురు. పెద్దవాడు యీ సంవత్సరం స్కూలుఫైనలు పరీక్ష వ్రాస్తాడు. రెండవది ఆడపిల్ల. మూడవవాడికి పదేళ్లు యిప్పుడు.'

'అదృష్టవంతుడివి.' ఆమె పెదవులు కంపించాయి.

అయిదు నిముషాలు గడిచిపోయాయి మౌనంగా. బండి మట్టిరోడ్డు వదలి కంకర రోడ్డు ప్రవేశించింది ఊళ్లోకి వస్తున్న సూచనగా.

'నీ భార్య కిప్పుడు నేనెవరినని చెప్తావు చలపతీ!'

'చెప్పడానికి భయపడవలసింది, సందేహ

# పథవిహీన

పడవలసింది ఏముంది అంతగా.' చలపతి అన్నాడు కాని మనసులో కొంచెం సందే హించాడు...అతను ఆలోచనలో తేరుకునే లోగానే బండి పెద్ద పెంకుటింటి ముందు నిలచింది.

చలపతి వెనుకగా ఆమె బండి కమ్మీ పట్టుకుని దిగింది.

'అమ్మా! నాన్న వచ్చారు.' వీధిలోకి వచ్చి తొంగిచూసిన పదేళ్లకుర్రాడు. యింట్లోకి అరిచాడు.

'మా ఆఖరివాడు. మా నాన్న పేరు పెట్టాను.'

సత్యవతి మాట్లాడకుండా కొంగు భుజాలచుట్టూ కప్పుకుంది.

'చీకటి! ఎంత ప్రయత్నించినా యింకా యీ ఊరికి ఎలక్ట్రిసిటీమాత్రం రాలేదు. యిక్కడ మెట్టుంది. జాగ్రత్తగా నడు.' చలపతి అంటూ వీధిగుమ్మంలో లాంతరు వత్తి పెద్దది చేసాడు.

ఇంతలో చలపతి భార్య గుమ్మంలోకి వచ్చింది.

'సీతా! మనింటికి బంధువుల్ని తీసుకు వచ్చాను.' చలపతి ఎంతో సహజంగా అన డానికి ప్రయత్నించాడు.

'ఎటువంటి బంధుత్వమో అడగండి చెప్తాడు.' సత్యవతి అంది.

చలపతి ఆశ్చర్యపోయాడు ఒక క్షణం. లాంతరువెలుగులో ఆమె కనులలో మెది లింది హాస్యమా? లేక సీరియస్‌గానే అందో చూడటానికి ప్రయత్నించి విఫలు డయ్యాడు.

'లోపలికి రండి.' చలపతిభార్య నవ్వుతూ అంది.

చలపతి దారితీసాడు.

సత్యవతి గది అంతా కలయజూసింది.

'కూర్చో,' చలపతి అన్నాడు.

చలపతి భార్య సీత గుమ్మంనానుకుని నిలబడింది. చలపతి ఆఖరివాడు ఆమె వెనుకనుంచి క్రొత్తబంధువుని చూస్తు న్నాడు. చలపతి సంచీలోనుంచి మాసిన బట్టలు బయటకి పడేస్తున్నాడు. 'అంతా గంభీరంగా క్రొత్తగా మారిపోయింది సత్య వతి రాకతో' చలపతి అనుకున్నాడు.

సరిగా రెండు నిముషాలు మౌనం ఆక్ర మించింది. సత్యవతి అలాగే బల్లమీద ఒక చేయిఉంచి నిలబడింది. ఈ నిశ్శబ్దాన్ని ఏవిధంగా భంగపరచాలో తెలియక తికమక పడ్డాడు చలపతి.

'మీరు స్నానం చేస్తారా?' సీత చివరకి సత్యవతి నడిగింది.

'ఊహూఁ!' ఆమె తల అడ్డంగా ఊపింది.

'మరి మీరు?' సీత భర్తవంక ప్రశ్నార్థ కంగా చూసింది.

'చెయ్యాలి. నీళ్లు కాగిఉన్నాయా?' తడుముకుంటున్నట్లు అన్నాడు.

'ఊఁ' సీత లోనికి వెళ్లిపోయింది.

చలపతి తనపని యేదో చేసుకుంటూ మధ్యమధ్య ఆగి సత్యవతివంక చూస్తు న్నాడు. ఆమె కంటినుండి ఒకేఒక బిందువు జారి బల్లమీద పడింది. ఆమె వ్రేలితో అటూ ఇటూ పాముతోంది ఆ తడిని.

'సత్యా!' చలపతి మెల్లిగా పిలిచాడు.

'ఏమామధ్య, ఈ వాతావరణంలో నేనుండ లేను. నన్ను పంపించివెయ్యి ఎలాగయినా యిక్కడినుంచి. నేను పొరపాటుచేసాను.' ఆమె స్వరం వణికింది.

చలపతికి ఆమె మనసులో బాధ సులు వుగా అర్థమయింది.

'ఛ! ఆదేమిటి! కళ్లు తుడుచుకో ముందు. ఎవరయినా వస్తారు.' చలపతి అనునయంగా అన్నాడు.

ఆమె కనులు ఒత్తుకుంది.

'సీతా!' సత్యవతికి మళ్లీ మాట్లాడ టానికి అవకాశం యివ్వకుండా పిలిచాడు.

'రాజా లోపల చదువుకుంటున్నాడా? ఒక సారిలా పిలు.' చలపతి భార్యతో అన్నాడు.

'కళ్యాణి కనపడదేం?' చలపతి ప్రశ్నకు సీత ఆగింది వెళ్లబోయినదల్లా.

'పడుకుంది.'

'అప్పుడే!'

'ఊఁ. పదయింది.' సీత వెళ్లిపోయింది.

రెండునిముషాల తరువాత చలపతి పెద్దకొడుకు వచ్చి గుమ్మంలో నిల్చున్నాడు లోనికి రావడానికి సందేహిస్తూ.

'రాజా! నీ చదువుకునే గది ఖాళీ చెయ్యి. నువ్వు నాగదిలోకి వెళ్లి చదువుకో.' చలపతి కొడుకుతో అన్నాడు.

'వసారాలో మంచం ఒకటి అక్కడ వెయ్యి,' మళ్లా పిలిచి చెప్పాడు.

'ఆగది విడిగాఉంది వెనుకవైపు. వీధి

# పథవిహీన

శోక్షి గుమ్మలకూడా ఉంది. నువ్వు మామయ్య తిరగక్కరలేదు. సరేనా?' చలపతి కొడుకు వెళ్ళిపోయాక అన్నాడు.

'చలపతీ!' ఆమె ఏదో చెప్పబోయింది.

'సత్యా! నాకింకేం చెప్పకు. నేను చెప్పినట్లు విను ముందు' చలపతి అన్నాడు—సత్యవతి నీరు నిండిన కనులతో చలపతి వంక చూస్తూ ఉండిపోయింది. అలాగ ఎంత కాలం గడిచిందో వారికి తెలియదు.

'నాన్నా! అమ్మ స్నానానికి నీళ్ళు పెట్టానని చెప్పమంది. ఆగది ఖాళీ చేసాను.' రాజు మాటలకి చలపతి బాహ్య ప్రపంచంలోకి వచ్చాడు.

'నీకు గది చూపిస్తాను. రా!' చలపతి సత్యవతితో అన్నాడు.

ఆమె అతనివెనుక నడిచింది.

'నీకు భోజనంకూడా యిక్కడికే పంపించనా?' చలపతి లాంతరు ఎత్తుగా కిటికీలో ఉంచి అడిగాడు.

'వద్దు, వద్దు, బాగుండదు,' సత్యవతి కంగారుగా అంది.

'లేకపోతే ఎవరెవరు నిన్ను చూస్తున్నారో, ఏమని ఆలోచిస్తున్నారో అనే ధ్యాసలో భోజనంకూడా మరచిపోతావు.' చలపతి నవ్వాడు.

సత్యవతి మాట్లాడలేదు.

'నేను స్నానంచేసి వస్తాను,' చలపతి బయటకు వచ్చేసాడు.

'మీయిద్దరికీ భోజనం వడ్డించాను.' సీత స్నానంచేసి లోపలికి వస్తున్న భర్తతో అంది. 'ఆవిడని పిలవనా?'

'ఊహూఁ. నేను తరువాత తింటాడు. ఆవిడకి భోజనం పడమటి గదికి తీసుకు వెళ్ళు. లేదులే. యిలాగియ్యి నేనే తీసుకుని వెళ్తాను.' చలపతి అన్నాడు.

'ఆదేమిటి?' సీత ఆశ్చర్యంగా అడిగింది.

'మన కులస్థులే' చలపతి తువాలుతో కంఠం తడిపి తుడిచాడు.

'మరి!' సీత సంశయంగా ఆగిపోయింది.

చలపతి మౌనంగా వంటయింట్లోకి నడిచాడు.

'అహాహా! క్రింద ఉంచు.' కంచం స్టూలు మీద ఉంచబోతున్న చలపతిని వారిస్తూ అంది సత్యవతి.

'నువ్వేమిటి చేస్తున్నావు?' చలపతి అడిగాడు.

'నాకివన్నీ అలవాటులేవు.' మంచం మీదున్న ప్రక్క బట్టలు మడతలు పెట్టి బల్లమీద పడేస్తూ అంది.

'అదేమిటి? పోనీ తలగడ ఉంచుకో.'

'వద్దు. తల క్రిందకి నా సంచీ చాలు.'

'నీ యిష్టం.' ఆ విషయంలో యింక బలవంతం చేయడం యిష్టంలేక అన్నాడు చలపతి.

'అన్నట్లు నీకు చెప్పడం మరచిపోయాను. రామ్మూర్తి యీ ఊళ్ళోనే ఉన్నాడు.' చలపతి బల్లమీద కూర్చుంటూ అన్నాడు.

'ఎవరు?'

'గుర్తులేదా? చిన్నప్పుడు సన్నగా, పీలగా ఉండేవాడు. గుడిప్రక్కన ఉండేవారు ప్లీడరు గారు—వాళ్ళబ్బాయి,' చలపతి ఉత్సాహంగా అన్నాడు.

'ఊఁ'

'రేపు తీసుకువస్తానుండు. చూద్దువు గాని. బాగా మారిపోయాడులే.'

'వద్దు చలపతీ! అందరూ నీలాగే ఉండరు.' సత్యవతి అంది.

చలపతి మాట్లాడక ఊరుకున్నాడు.

'నువ్విలా ప్రక్కన్నుంచి చూస్తూ ఎదురుగా కూర్చుంటే నేను అసలు భోజనం చేయను.' సత్యవతి అంది యిబ్బందిగా.

'సరే అయితే. నేను కూడా యీలోగా భోజనం చేసి వస్తాను.' చలపతి నవ్వి లేచాడు.

'మళ్ళీ రానక్కరలేదు. ప్రొద్దుపోయింది కాని, వెళ్ళి పడుకో. చీటికీ మాటికీ చూస్తూ ఉండక్కరలేదు. నేనేమీ పారిపోనులే.' సత్యవతి అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

ఆ రాత్రి త్వరగా నిద్రపట్టలేదు. చలపతికి. మళ్ళీ చిన్నతనం అంతా గుర్తుకి వస్తోంది. ముందు పధిబడి. తరువాత మూడు మైళ్ళ దూరంలోని హైస్కూలు. ఏకూ చింతా లేకుండా తిరిగే ఆనాటి సత్యవతి యిలాగ మారిపోయిందంటే అంతా ఆమె దోషమేనా? అంత తెలివిగా ఉండే సత్యవతి ఎలాగ మోసపోయింది? తన హైస్కూలులో ఆఖరి రోజులు గడిపే టప్పుడు యింకా గుర్తుంది. తన చేత ఎవరితోనూ చెప్పనని వాగ్దానాలు, ఒట్లు వేయించుకుని, ఆ కాలేజీలో చదివే అబ్బాయికి ఉత్తరం యిచ్చి రమ్మంది.

చలపతి ఆ అబ్బాయి మొఖం గుర్తు తెచ్చుకోవానికి ప్రయత్నించాడు. ఊహూఁ! లాభం లేదు. ఉంగరాలజుట్టు అంతే గుర్తుంది.

తను నీతులు చెప్పబోతే విదలించి పోలేసింది. 'పాపం! బుచ్చి! బుద్ధిమంతుడిలాగ వెళ్ళి పాఠాలు చదువుకో కలకండ బుగ్గనెట్టుకుని' అంటూ.

చలపతికి ఆమాటలు జ్ఞాపకంవచ్చి చిన్న చిరునవ్వు వచ్చింది.

ప్రక్కకి తిరిగాడు నిద్దరాక...ప్రక్క మంచంమీద సీతలేచిన చప్పుడయింది మంచినీళ్ళకి.

'యింకా నిద్రపోలేదా? సీతా!' చలపతి అడిగాడు.

'ఊహూఁ ఎవరండీ ఆవిడ?'

'నీకు తెలియదులే.' చలపతి ప్రక్కకి తిరిగి పడుకున్నాడు.

నూనె అయిపోయి కొడిగట్టి దీపం ఆరిపోయాక చలపతి నిద్రపోయాడు ఆరాత్రి.

* * *

'ఎన్నాళ్ళిలా యిక్కడ నేను?' మూడు రోజుల తరువాత సత్యవతి చలపతిని అడిగింది.

'ఏం? అప్పుడే మొహంమొత్తిందా నా ఆతిథ్యం?'

'ఆతిథ్యం కాదు. రాణీవాసం లాను.'

'అంటే'

'లేకపోతే యేమిటి చలపతీ! నేనిక్కడ యేపనీ ముట్టుకోకుండా వేళకి మాత్రం తెచ్చిపెట్టిన విందులారగిస్తూ.'

'పోనీ మాయింట్లో అంట్లు తోమ కూడదూ?' చలపతి హాస్యంగా అన్నాడు.

'ఏం అటువంటివి చేసేన్నడూ చేయ లేదనుకుంటున్నావేమో! అంతకంటె హీన మయినవే చేసాను.'

చలపతి తనామాట అని ఉండకూడ దనుకుని బాధపడ్డాడు.

కొంచెంసేపు మౌనంగా ఉండిపోయారు. ఎంత హాస్యంతో కప్పిపుచ్చినా అసలు సమస్య ఉండనే ఉంది.

'ఏం చేద్దామంటావు? నువ్వే చెప్పు,' చలపతి అడిగాడు.

'ముందు నన్ను యింట్లోనుంచి వెళ్ళ గొట్టు.'

'ఎక్కడికి వెళ్తావు?'

'ఏమిటో నీకి.' సత్యవతి కోపంగా అంది.

'మా ఊళ్ళో లేదు.' చలపతి తేలికగా నవ్వాడు.

మళ్ళీ యిద్దరూ గంభీరంగా మారిపోయి ఊరుకున్నారు.

'పోనీ. ఒకటి చెప్తాను చేస్తావా?' చలపతి చివరకి అన్నాడు.

'చెప్పు.'

చూడు సత్యా! నీకు ఎక్కడా ఎవరూ లేరు. ఈ ఊర్లోనే ఉండిపో. నేను నీకు ఏదో విధంగా దారి చూపిస్తాను నా మీద ఆధారపడ్డావనే బాధ నీకు లేకుండా చేయగలను. నీవు నాకళ్ళ ముందు నుంచి దూరంగా వెళ్ళొద్దు, కష్టపడతావు.' సత్యవతి ఒకసారి తల యెత్తి చూసి మళ్ళీ దించుకుంది.

'విషయం యింత తిన్నగా చెప్పినందుకు క్షమించు సత్యా! నీ మనసు బాధపడితే.'

'లేదు. నువ్వు చెప్పినట్లు చేయటం కంటె గత్యంతరం కూడా లేదు. కాని ఒక్క విషయం. నేను యింట్లో మాత్రం ఉండను.' సత్యవతి అంది.

'అదేం? మాకేం యిబ్బందిగా లేదు. ఎంత పెద్దయిల్లో చూసావుగా.'

'అదికాదు చలపతి! నీ భార్యతో నేను ఒక్క మాట కూడా మాట్లాడలేదు. ఏమని మాట్లాడగలను చెప్పు. నాకు చాలా యిబ్బందిగా ఉంది యీ విషయంలో. వాళ్ళ దృష్టిలో నేను...' సత్యవతి ఆగిపోయింది.

'సరే అలాగయితే. నీ యిష్టం'

'ఇంకో సంగతి. నీవు తరచు ఆ యింటికి అంటే నేనుండే స్థలానికి కూడా రావడానికి వీలులేదు.

'అదేమిటినే?'

'నీ మంచికే చెప్తున్నాను. నేనెలాగూ చెడిపోయాన్లే.'

'వాల్లే కట్టిపెట్టు. నా యిష్టం వచ్చినప్పుడు వస్తాను. నీ రెండో షరతు నేనామోదించలేదు.' చలపతి సంభాషణ తేలికగా మళ్ళించి ఒప్పించడానికి ప్రయత్నించాడు.

సత్యవతి ససేమిరా వల్లకాదంది. చివరకి చలపతి ఒప్పుకున్నాడు.

'పూర్తిగా రావటం మానేసేవు సుమా! పీడ తప్పిందేచాలని. వారం రోజులకో ఎప్పుడో బ్రతికి ఉన్నానో చచ్చానో చూసి పోతూ ఉండు.'

'అదేం మాట సత్యా!' చలపతి బాధగా అన్నాడు.

'యింకెప్పుడూ అననులే.' చలపతి ముఖంలో బాధచూసి సత్యవతి అంది నవ్వడానికి ప్రయత్నిస్తూ.

నాలుగు రోజుల తరువాత చలపతి ఒక చిన్న యిల్లు చూసి సత్యవతిని తీసుకుని వెళ్ళాడు. రెండే రెండు గదులు. ఒకటి చిన్నది. వంటకి ఉపయోగించవచ్చు.

'ఎలాగ ఉంది? చలపతి అడిగాడు.

'బాగానే ఉంది. నేను పెద్ద అద్దెలు యిచ్చుకోలేను. నీ డబ్బు ఒక్క నయాపైస అయినా నాకు తెలియకుండా ఖర్చు పెడితే ఊరుకోను.'

'నీ రెండు షరతులలో యిదిలేదే. అయినా రైలులో అనవసరంగా పాతిక రూపాయలు ఖర్చు పెట్టించావుగా. అప్పు తీరుస్తావా?' చలపతి నవ్వుతూ అన్నాడు.

'ఆ సంగతి వేరు. ఆ శిక్ష అక్కడితో నీకు చాలు.' సత్యవతి కూడా నవ్వింది.

'రేపటి నుంచి పదిమంది పిల్లల్ని పంపిస్తాను. నీకు తెలిసిన చదువేదో వాళ్ళకి చెప్పు.' చలపతి అన్నాడు.

'లమ్మో!'

'ఫస్టుఫారం, సెకండ్‌ఫారం వాళ్ళే. నీకేం కష్టం ఉండదు.'

'నీ ఋణం ఎలాగ తీర్చుకోడమా అని ఆలోచిస్తున్నాను.' తలదించుకుని అంది సత్యవతి.

'పెద్ద వ్రాయిస్తాలే మరచిపోకుండా!' చలపతి నవ్వాడు.

'నువ్వు నాకు తల్లివా, తండ్రివా ఎందుకింత జాలిపేసంటే చలపతీ!'

'ఏమీకాను కాబట్టేనేమో! యింకో సవరణ యేమిటంటే నీమీద నాకున్నది జాలికాదు.' చలపతి నవ్వి అన్నాడు.

సత్యవతి నవ్వలేదు. నీరునిండిన కనులు కృతజ్ఞతను వెదజల్లుతున్నాయి.

'అలా చూడకు మరి. అక్కడికి నేనేదో దేవుడినయినట్లు. నేను చేసిందేమీ లేదు యిందులో. నేను మళ్ళీ తరువాత కనపడతాను.' చలపతి యింక అక్కడ ఉండలేక తలుపుతీసుకుని బయటకు నడిచాడు.

* * *

ప్రొద్దున్న పదిగంటలవుతుంది.


'కళ్యాణీ! వీధితలుపు చప్పుడవుతోంది. ఎవరో చూడు.' కుడుతున్న మిషను చేతితో ఆపుచేసి అంది సీత.

'రుక్మిణత్తమ్మ.' కళ్యాణి అక్కడినుంచే అరచింది.

'ఏమిటే కేకలు? మెల్లిగా చెప్పలేవూ?' సీతకూతురిని కసురుకుంది.

'ఉండవే మరి. వాడగ్గరనుంచి పట్నం బావ విశేషాలు వస్తాయని దావి పడ్డావుడి.' రుక్మిణి నవ్వుతూవచ్చి దగ్గరగా నిల్చుంది.

'ఏమిటి విశేషం? నల్లపూసవైపోయావు యీమధ్య.' సీత మళ్ళీ తనపని మొదలు



హెడన్సా


మూల వ్యాధులకు.
ప్రతి చోట దొరుకును

పండిట్
డి.గోపాలాచార్యులవారి
జీవామృతం
దేహపుష్టికి ఆరోగ్యమునకు
ఆయుర్వేదాశ్రమం
ప్రై. లిమిటెడ్
మదరాసు-17

పుస్తకములు

5 పుస్తకముల సెట్టు రు. 5-50.
(1) కొక్కోకశాస్త్రం (2) మహాగాత్ (3) చుంబన పద్ధతులు, (4) 84 ఆసనములు, (5) రహస్యఫోటో ఆల్బం. ఒక్కొక్క పుస్తకం రు. 2/-. పోస్టేజి, ప్యాకింగ్ అదనం. ఇంగ్లీషులో వ్రాయండి.
SULEKHA TRADERS,
(WAT-7) Beat No. 13, Aligarh.

3 చీరెలు ఉచిత బహుమతి

స్త్రీలకు అందాన్నిచ్చే కాశ్మీర్ ఆర్ట్ చీరెలు:పరికొత్త ఆకర్షణీయమైన నమూనాలలోను రంగులలోను యీ బుటువుకుతగినట్లు మావద్ద గలవు. పెద్ద సైజులలో మాత్రమే లభించును. 1 డీలక్స్-చీరెరు.11లు; 2కి రు.20లు; 3 కి రు. 28లు; 4కి రు. 36/- రెండు లేక అంతకు పైన చీరెలకు ఆర్డరు పంపిన వారికి బ్లౌజు గుడ్డ ఉచితం మీ ఆర్డరును పోస్టు పార్శిలు ద్వారా పంపెదము.
ARVIND AGENCIES (APW-22)
P. B. 1408, Delhi-6.

# పథవిహీన

పెట్టింది.

'సరేలేకాని...మీ ఆయన యింట్లోనుంచి వెళ్ళినట్లేనా?' రుక్మిణి ప్రశ్నించింది.

'ఇప్పుడే వెళ్ళారు. కూర్చో.'

'మావాడు పరీక్ష పాసయ్యాడు. అదీ విశేషం.'

'ఇంకేం నీకొడుకు డాక్టరయిపోయాడు. రోజుకొక యింజెక్షను పొడిపించుకోవచ్చు' సీత నవ్వింది.

'మొదటి సంవత్సరంతోనే అయిపోయిందా తల్లీ' అని ఆగింది రుక్మిణి.

'ఇదిగో సీతా! దాని ముఖంచూడు మతాబాలాగ ఎలాగ వెలిగిపోతోందో యీ సంగతి వినేసరికి. అప్పుడే అక్కడికి తన మొగుడు డాక్టరయిపోయినట్లు' నవ్వుతూ కళ్యాణివైపు చూపింది.

'పో అత్తా! ఎప్పుడూ నన్నేడిపించడానికే మాయింటికి వస్తావు.' కళ్యాణి సిగ్గుపడింది.

'ఏది కోడలా! నీ ముఖంలో ఏడుపే ఉందో నవ్వే ఉందో ఒకసారి ఎవరినయినా అడుగు' రుక్మిణి పకపకనవ్వి కళ్యాణి బుగ్గ గిల్లింది.

'నువ్వొక్కర్తివే యింట్లో ఉంటావను కున్నాను. ఈవిడగారు స్కూలుకి నామం పెట్టిందేం? నేను వస్తానని కాని తెలిసిందేమిటి?' రుక్మిణి సగం హాస్యంగాను, సగం సీరియస్‌గాను అని కళ్యాణికేసి చూపించింది.

'ఏమిటి విశేషం?' సీత ఆగి అనుమానంగా చూసింది.

'చెప్తాగా' అని 'కళ్యాణీ! నీకు కావలసిన వార్తలన్నీ చెప్పేసాను. యిక్కడినుంచి వెళ్ళు. మీ అమ్మా నేనూ మాట్లాడుకోవాలి.' రుక్మిణి కళ్యాణిని లేవదీసింది.

సీత ఆశ్చర్యంగా చూసింది.

'చాటుగా విన్నావంటే ముక్కు పిండేస్తాను' రుక్మిణి కళ్యాణితో అని సీతవైపు తిరిగింది.

'సీతా! ఆవిడ యీ ఊరువచ్చి ఎన్నాళ్ళయింది?'

'ఎవరు?' సీత ఆశ్చర్యంగా అడిగింది.

'ఇంకెవరు? మీ ఆయన తీసుకురాలా?'

'రెండునెలలవుతోందేమో? ఏం?'

'మీ ఆయన పద్ధతి యేమి బాగాలేదు సీతా! ఊళ్ళో అందరూ నాలుగు రకాలుగా అనుకుంటున్నారు.' రుక్మిణి మెల్లిగా అంది.

సీత ముఖం నల్లబడిపోయింది.

'ఏమిటి నువ్వనేది?'

'ఇదేమయినా మహాపట్నమా? ఒకరి సంగతి మరొకరు పట్టించుకోకుండా కూర్చోడానికి. మీ యింటాయనకి తెలియాలి ఆ సంగతి.'

'ఇంకొకటేదయినా మాట్లాడుదూ యిక్కడికి ఆపి.' సీత చిరాకుగా అంది.

'నీకు చెప్పడం నాకు యిష్టం అనుకోకు.' రుక్మిణి కొంచెం కోపంగా అంది.

'అదికాదుకానీ. యిప్పుడసలేం జరిగింది? ఏదో గతిలేని మనిషికి పోషణ కల్పించారు. అదీ ఒక నేరమే?' సీత అంది.

'గతిలేని అమాయకురాలయితే ఏం పర్వాలేదు. కాని ఆమనిషి వెనుక చాలా కథ ఉందట!'

'ఆ'ట'తో చెప్పుకునే కథలు నాకు చెప్పకు. రుక్కూ!'

'అలాగ నామీద కోప్పడి నా నోరు మూయించగలవు కాని ఊరందరి మాటేమిటి?'

'ఇష్టం వచ్చినట్లు అనుకోనీ నాకు సంబంధంలేదు. ఆయన తత్వం నాకు తెలుసు.'

'నేనుమాత్రం కాదన్నానా? నా ఉద్దేశ్యం యేమిటంటే అసలు ఈ ఊహలకి అవకాశం యివ్వకుండా ఉండలేరా అని.'

సీత మాట్లాడకుండా ఊరుకుంది.

'అసలు ఆవిడ యెవరు?'

'ఆయనకి బాగా తెలిసిన వ్యక్తి.'

'ఏవిధంగా? బంధువా? స్నేహితురాలా?'

'నాకు తెలియదు.'

'మరి నువ్వెప్పుడూ అడగలేదా?'

'నాకనవసరం రుక్కూ! నా కటువంటివి యిష్టం ఉండవు. అంత ముఖ్యమయినదయితే ఆయననాతో చెప్పకుండా ఉండరు.'

'సరే వారి సంబంధంలో అపవిత్రతేమి లేదనే అనుకుందాం. కానీ లోకం కోసమయినా కొంచెం చూసుకోవద్దా.'

'ఆయన సంగతి నీకు తెలియదు రుక్కూ!

'ఆయనో మనసుకి తోస్తే యింక దేనికీ వెరవరు.'

'పోనీ నువ్వే చెప్పు.'

'ఏమని?' సీత కనుబొమలు ముడిచింది.

'ఊళ్ళో అందరూ యిలాగ అనుకుంటున్నారని.'

'ఛీ! నేను కూడా నమ్ముతున్నానని అనుకోకూ.' సీత తీక్షణంగా అంది.

'మరయితే యీ ఊళ్ళో యీ బుర్రకథలు, హరికథలు జరుగుతూ ఉండాల్సిందేనా?'

'పనిలేని వాళ్ళు చెప్పుకుంటారు. ఆపగలమా?' సీత చిరాకుగా అంది.

'సరే అయితే. యింతకీ నీలాంటి భార్య దొరకడం మీ ఆయన అదృష్టం. నిన్ను హెచ్చరించటం మంచిదనుకున్నాను. మరోలా అనుకోకు.' రుక్మిణి వెళ్ళిపోయింది.

సీత మనసంతా చికాకుగా అయిపోయింది. ఎంత మరచిపోదామన్నా వీలుకావటం లేదు. ఏ పని చేస్తున్నా ఒకటే ఆలోచన! యిటువంటి వదంతి ఎందుకని పుట్టింది?

చలపతి ఆ రోజు రెండు మూడుసార్లు అడిగాడు. 'అలా ఉన్నావేమిటని'

రాత్రింబవళ్ళు అదే ఆలోచన సీత మనసులో దొలిచి స్థానం కోసం ప్రయత్నిస్తోంది. ఛ! యీ ఊహ మనసులోనికి రానీయకూడదని వందసార్లనుకుంది. అనుకున్న ప్రతిసారీ మరు నిముషం పెనుభూతంలా ఎదురుగా నిలుస్తోంది. ఏం చేయాలి? భర్తని అడిగేస్తే సరిపోతుంది. ఒక్కొక్క క్షణం అలాగ అనిపించేది. మరుక్షణం మనసు తనంత తాను సమాధానపరచుకునేది.

మరునాడు మధ్యాహ్నం సీత అన్నగారు గోపాలం వచ్చాడు. భోజనం చేసిన తరువాత ఏవో మాటలు చెప్పుకుంటూ ఉండగా మధ్యలో ఆగి అన్నాడు గోపాలం.

'అవును కాని సీతా! బావ గురించి అంతా యేదో చెప్తున్నారు. ఎవరినో తీసుకుని వచ్చాడట. నీకేమయినా తెలుసా?'

'ఏం? నీ ఊరికి కూడా ప్రాకిందేమిటి?' సీత నీరసంగా అంది.

'ఈ ఊరతనే అక్కడికి ఏదో పని మీద వచ్చినప్పుడు నాతో అన్నాడు.'

'అందుకనే వచ్చావా? యిప్పుడు?' సీత అడిగింది.

'నిజం తెలుసుకోవాలిగా. అయినా బావకీ వయసులో యేమిటీ పిచ్చి.?'

'అన్నయ్యా!' సీత తీక్షణంగా అంది. 'చెప్పుడుమాటలువిని అంటున్నావు. ఆయన సంగతి యిన్నాళ్ళుగా చూస్తున్నావు. నీకు తెలియదా?'

లోలోపల అంతరాత్మ ఓడిపోయావు అని హేళన చేస్తోంది. కనులలో నిప్పుపోయుత, కోపంచోటు చేసుకున్నాయి.

'మరి నాతో చెప్పినతను నాకు బాగా తెలిసినవాడే. అబద్ధం చెప్పడని నేననుకోను.' గోపాలం సంశయంగా అన్నాడు.

సీత అన్నగారికి జవాబివ్వలేదు. ముఖం ఎర్రబడిపోయింది.

'నీదంతా తెల్లనివన్నీ పాలనుకునే స్వభావం సీతా! నిప్పులేనిదే పొగరాదుగా? అసలు బావ మామూలుగా పూర్వంలాగే ఉంటున్నాడా?' గోపాలం అడిగాడు.


'ఆయనలాంటివారు కారన్నయ్యా!' సీత మనసులో బాధ పట్టలేక యేడ్చేసింది.

'ఛ! ఊరుకో. ఏదో అందరూ అనుకుంటున్నారని చెప్పాను. అవకాశం దొరికితే వెయ్యి వదంతులు పుడ్తాయి. నాకు నిజంగా యేమీ అనుమానం లేదులే. అసలిదెందుకు వ్యాపించిందో తెలుసుకుందామని వచ్చాను.' గోపాలం ప్రేమగా అన్నాడు.

రెండు నిముషాల తర్వాత సీత తలయెత్తి అన్నగారివంక చూసింది.

(59వ పేజీ చూడండి)

## అల్లాటప్పయ్య



పికనలేం అనుమానం లేనప్పుడు బాకనలు ఆ బెంగలేదు. ఇంక ఆ ప్రసక్తి వదలి పెట్టెయ్యి. వెళ్ళి ముందు ముఖం కడుక్కునిరా. నాకు కొంచెం మంచినీళ్ళు తెచ్చిపెట్టు.' గోపాలం అన్నాడు.

సీతలేచి వెళ్ళింది.

'ఎల్లుండి వంటాడి పుట్టినరోజు. ఏదో హడావుడిచేస్తుందిట మీ వదిన. నిన్ను తీసుకునిరమ్మంది. రాకూడదటా పోనీ.' గోపాలం మంచినీళ్ళుతాగి గ్లాసు చేతి కందిస్తూ అడిగాడు.

'ఇప్పుడాయనకి ఖాళీలేదన్నయ్యా. ఏవో పరీక్షలు' సీత అంది.

'పింగినాదం. బస్సెక్కితే గంటప్రయాణం లేదు. ప్రొద్దున్న బయలుదేరితే సాయం కాలం తిరిగిరావచ్చు. అయినా నువ్వు రావచ్చుగా. ఒకపూట వండుకుని తినలే రేమిటి?'

'ఇప్పుడు కాదులే.' సీత తల అడ్డంగా ఊపింది.

'సరే అయితే. నా మాట వింటావు కనుకనా. నేనలా స్కూలుకి వెళ్ళి బావకి కనపడి మూడు గంటల బస్సు అందుకుంటాను మరి' గోపాలం లేచాడు.

'ఒక నిముషం ఉండు.' సీత లోపలికి వెళ్ళి పదిరూపాయల నోటుతో తిరిగివచ్చింది.

'వంటాడికి.'

గోపాలం తీసుకోలేదు. 'అవన్నీ ఎందుకే. పోనీ నువ్వెప్పుడయినా వచ్చినప్పుడు ఇవ్వచ్చులే.'

'అలా కాదు. నా తృప్తికోసం. అయినా నేను రావడానికి ఎప్పుడు వీలవుతుందో యేమో!' సీత బలవంతంగా అన్నగారి జేబులో పెట్టింది నోటు.

గోపాలం వీధిగుమ్మంవరకూ నడిచాడు.

'అన్నయ్యా!' గోపాలం ఆగి చూసాడు.

'ఆవిషయం ఆయనతో ప్రస్తావించేవు సుమా! నామీద ఒట్టు.' సీత అంది.

'అలాగే.' గోపాలం ఒకక్షణం వాత్సల్యంగా చూసి సాగిపోయాడు.

* * *

'సత్యవతీ!' చలపతి తలుపు మీద కొట్టాడు.

ప్రక్కయింట్లోనుంచి ఎవరో బయటికి వచ్చి చూసి మళ్ళా లోపలికి వెళ్ళి పోయారు.

## పథవిహీన

(39వ పేజీ తరువాయి)

తలుపు తెరచుకుంది.

'నువ్వు నామాట వినటంలేదు చలపతీ! యింత తరచుగా రావద్దని చెప్పానా లేదా?' సత్యవతి కొంచెం కోపంగా అంది.

చలపతి చిన్నబుచ్చుకున్నాడు. 'లేదు సత్యా! చిన్న విషయం చెప్పిపోతాను. రేపటి నుంచి మరింకో యిద్దరు పిల్లల్ని పంపిస్తాను. మరి నేవస్తాను.' చలపతి వెనక్కి తిరిగాడు.

'ఎలాగూ వచ్చావుగా. కొంచెంసేపు కూర్చునిపో. నువ్వేదో నాకు మంచిచేయబోయి వస్తావు. నేను నా మాటలతో నిన్ను బాధ పెడుతూ ఉంటాను.' సత్యవతి విచారంగా అని లోపలికి దారితీసింది.

'నన్నుగురించి ఊళ్ళో యేమనుకుంటున్నారు?' సత్యవతి కొంచెం సేపయిన తరువాత మాటల మధ్యలో అడిగింది.

'ఏమనుకుంటారు? ఎవరికి పట్టింది అయినా తీరికూర్చుని ఆలోచించడానికి.

'శుద్ధ అబద్ధం. ఋజువు కావాలంటే చెప్పనా. నువ్వు మొదట పంపిన పిల్లలలో మూడురోజులనుంచీ అయిదుగురు రావడం మానేసారు.'

'అదేమిటి? ఎందుకని? నేను కనుక్కుంటాను రేపు.' చలపతి అన్నాడు ఆశ్చర్యపోయి.

'అవసరం లేదు చలపతీ! నువ్వు అమాయకుడివి. అందుకే అలాగంటున్నావు.'

'అంటే'

'ఏముంది? నా పూర్వచరిత్ర అంతా మీ ఊళ్ళో వ్యాపించి ఉంటుంది యిపాటికి.' నిర్లిప్తంగా అంది.

'ఈ ఊరి ప్రజలకి కూడా యీ వ్యాధి అంటుకుందంటావా?' ఒక క్షణం ఆగి అన్నాడు చలపతి నిస్పృహగా.

'వ్యాధి క్రొత్తగా వ్యాపించడం కాదు చలపతీ! అది యీ ప్రపంచంలో యెక్కడికి వెళ్ళినా కనపడుతుంది'

'నేను వెళ్తాను. నేనేదో ఆలోచిస్తాను. నువ్వు అధైర్యపడకు.' చలపతి బయటకు నడిచాడు ఆలోచిస్తూ;

పిచ్చి చలపతీ! నువ్వేమీ చేయలేవు. ఓడి పోయి తలవంచుకుంటావు చివరికి.' సత్యవతి పెదవుల వెనుక గొణుక్కుంది.

* * *

మందంగా చీకటి అలుముకొంటోంది. సీత వీధి గుమ్మం వానుకుని నిలబడింది. మనసులో భర్త యింకా యింటికి రాలే దేమో' అని ఆలోచన. ఎప్పుడూ స్కూలు అయిపోయిన తరువాత ఒక గంటలో యింటికి వచ్చేస్తారే. యివాళ యేం జరిగింది? ఆత కాశం కోసం ఎదురుచూస్తున్న అనుమానం హృదయంలో చొరబడదామని విశ్వప్రయత్నం



## శుభవార్త

డాక్టర్లకు సాధ్యంగాక వదలి వేయబడిన అన్ని వ్యాధులకు చికిత్స చేయబడును

మధుమేహము, రక్తపుపోటు, కుష్ఠు, బొల్లి, కేన్సర్, క్షయ, సంతానము లేనివారు కూడా శ్రీ యోగిగారి చికిత్సవలన సంపూర్ణ ఫలమును బడయగలరు

కావలసినవారికి కాయకల్ప చికిత్స చేయబడును. ఈ చికిత్స వలన దేహములో వున్న వ్యాధులు తొలగిపోవుటయేగాక నూతన యవ్వనము కలుగును

వివరాలు కోరువారు పోస్టుఖర్చులకు ఒక రూపాయి పంపవలెను.

**శ్రీ యోగాశ్రమము**

పి. ఓ. పెదవాల్తేరు, విశాఖపట్నం

---

### రెండు రత్నాలు

Licenced under M. & T. P. Act — Rule (83)

వీర్యస్తంభనము–Tonic Pills&Oil·

కడుపుకోకి పైకి మర్దనకు (1) కోర్సు 20 రోజులకు రు. 32లు–స్పెషల్ రకం రూ. 47

ప్రైకం M.O. పంపాలి—వి. పి. లేదు.

డా. రత్నం సన్స్, (Estd 1904)

తులకపేట బిల్డింగ్స్, New

ఆజంపూరా మార్కెట్ వద్ద,

హైదరాబాద్— 36 ఆం. ప్ర.

---

### వాయిదాలపద్ధతిపై ట్రాన్‌సిస్టర్

నెలకు రు. 30/– వంతున చెల్లించి "నేషనల్" పోర్టబుల్ 3 బ్యాండ్, ఆల్ వరల్డ్ ట్రాన్‌సిస్టర్ పొందండి. దీనికి పగుల నట్టి ప్లాస్టిక్ పెట్టె కూడా వుండగలదు. నేంచే వ్రాయండి.

Jagson Agencies (WAP–88)

P. B. 1212, Delhi-6.


# పథవిహీన

చేస్తోంది. సీత మనసు వెనక్కి వెళ్ళిపోతోంది. వీధిలో మనుష్యుల ఆకారాలు అస్పష్టమయి పోతున్నాయి చీకటి పెంద్రమయి.

దూరంగా యెవరో వస్తున్నారు. సీత మెట్లుదిగి చూసింది.

రాజా చేతులూపుకుంటూ వస్తున్నాడు. 'వయసు పదిహేనేళ్ళే అయినా తండ్రి అంత యెత్తు ఉన్నాడు. ఒకటే పోలిక.' సీత మనసులో అనుకుంది.

'అమ్మా! చదువుకోవాలి. అన్నంపెట్టు.' రాజా హడావుడిగా లోపలికి నడిచాడు.

'కళ్యాణిని పిలు పెడుతుంది.' సీత గుమ్మంలో నుంచి కదలలేదు.

'అదెక్కడుందో యేమో!' రాజా కొంచెం విసుక్కుంటూ లోపలికి వెళ్ళిపోయాడు సీత కళ్ళు చీకటిని శోధించాలని విశ్వప్రయత్నం చేస్తున్నాయి. పావు గంట గడచిపోయింది.

'కళ్యాణీ! దీపం ఒకటి గుమ్మంలో పెట్టు.' సీత కేకేసింది.

కళ్యాణి వచ్చింది. 'రోజూ యిలా చెయ్యి అని ఎవరయినా చెప్పాలేమిటే? అన్నయ్యా అన్నం తింటున్నాడా?' సీత అడిగింది.

'ఊఁ' కళ్యాణి కొంచెం విసురుగా మళ్ళీ లోపలికి వెళ్ళిపోయింది. సీత కూడా ఒక క్షణం చూసి లోపలికి నడిచింది.

'రాజా! నాన్నగారు యింకా స్కూలు లోనే ఉన్నారా? యింకా యింటికి రాలేదు?' సీత అడిగింది.

'లేదమ్మా. అప్పుడే వెళ్ళిపోయేరే. నేను స్కూలు నుంచే వస్తున్నానుగా. బహుశ అక్కడికి వెళ్ళేరేమో.' రాజా భోజనం చేయటం పూర్తిచేసి లేస్తూ అన్నాడు.

'ఎక్కడికి?' సీత కనుబొమలు ముడి వడ్డాయి.

'అదే మనింటికి రాలా? ఆవిడింటికి.' రాజా మాటలు యింకా పూర్తికాలేదు.

'రాజా!' సీత తీక్షణంగా అంది. 'అనవసర విషయాలు మాట్లాడకు.'

తల్లికి అంతకోపం యెందుకు వచ్చిందో అర్థంకాలేదు రాజుకి. తలవంచుకుని వెళ్ళి పోయాడు అక్కడినుంచి.

సీతమనసులో ఘోష బయలుదేరింది. తలవేడితో పగిలిపోతునట్టుంది. 'వాడిమీద కోపగించుకొని ప్రయోజనం యేముంది? వాడికేం తెలుసు నిజానిజాలు. తను అతి వసరంగా తొందరపడుతోంది.' సీత విసుగ్గా తనలో తనే అనుకుంది.

'కళ్యాణీ! బావిగాడేడి?' సీత అడిగింది.

'పక్కింటికెళ్ళాడు. పత్రిక తెమ్మన్నాను.'

'వాడు వచ్చినతరువాత మీరిద్దరూ అన్నం తినేయండి. నాకు తల నొప్పిగా ఉంది.' సీతగదిలోకి వెళ్ళి తలుపు బిగించు కుని మంచంమీద వాలిపోయింది.

'యింతమంది యిన్నివిధాలుగా ఎందుకు చెపుతున్నారు? యిందులో యేమయినా నిజం ఉందేమో! ఆయనెందుకు తనతో చెప్పరు? ఆవిడెవరు? మొదటిసారిగా సీత మనసులో అనుమానం తగిన స్థానం పొందగలిగింది.

'ఛీ! ఛీ! ఒక్కరోజు యింటికి రావడం ఆలస్యమయితే తనెందుకు పిచ్చిగా ఊహిం చాలి?' సీత వెంటనే తన మనోదౌర్బ ల్యాన్ని కొట్టేయడానికి ప్రయత్నించింది. యీ ఆలోచన యింక మనసులోనికి రాని యకూడదు.! మనస్ఫూర్తిగా అనుకుంది.

'ఈ రోజుతో తను ముప్పయి అయిదు సంవత్సరాలు నిండి ముప్పయి ఆరవసంవత్స రంలో అడుగుపెట్టింది! సీత దగ్గరలో ఉన్న అద్దం ముఖానికి దగ్గరగా ఉంచు కుని చూసుకుంది. 'భర్త ఒక్కడే తనని సీతా! అని పిలుస్తాడు. ఊరివారందరికీ సీతమ్మగా యే నాడో మారిపోయింది.' యవ్వనదశ చాలా యేళ్ళక్రితం కనుమరు గయిపోయింది. వార్ధక్యం మీదపడి ఆక్రమి స్తోంది. తను తప్పించుకోలేదు. అద్దంలో ప్రతిబింబం తనదికాదు. సీతమ్మ! తలలో చెదురుమొదురుగా తెల్లవెంట్రుకలు మెరుస్తున్నాయి. క్రొత్తలో ఒకటి రెండలా పీకిపారేసింది. యిప్పుడు తన సాధ్యంకాదు. నుదుటిమీద కనపడి కనపడకుండా రెండు ముడతలు కనిపిస్తున్నాయి. కళ్ళకింద నల్లని ఛాయలు శాశ్వతంగా నరచు కున్నాయి. ముఖంలో కాంతి క్రొత్తరంగుకి మారుతోంది.

'తనకంటె ఆవిడ యింకా అందంగా ఉండి ఉంటుంది. యీనాటికి కూడా అందం చెదరలేదు' మళ్ళా తన ధ్యాన వద్దను కున్నచోటే ప్రదక్షిణం చేస్తోంది. లేక పోతే తనకీ ఆ మనిషికీ పోలికెందుకు?

సీత తనమీద తానే చిరాకు పడింది.

రెండు నిముషాలు కళ్ళుమూసుకుని పడుకుంది. 'లాభంలేదు. ఇలా ఆలోచన నన్ను వదలిపోదు!' సీత నిస్పృహగా అనుకుంది.

గడియారం ఎనిమిది గంటలు కొట్టింది.

సీత ఉలికిపడింది. 'ఈయన ఇంకా రాలేదేం? ఏదయినా ప్రక్క ఊరు వెళ్ళారేమో! పనిమీద. అలాగయితే ప్యూన్‌చేత కబురంపి ఉండేవారే.'

'అక్కడికే వెళ్ళి ఉంటారు.' అంతరాత్మ అంతకంతకు స్వరం పెద్దదిచేసి చెవిలో అరుస్తోంది.

సీత గట్టిగా కనులుమూసుకుని నిద్రపోవడానికి ప్రయత్నంచేసింది. అదేసమయంలో చలపతి నిజంగానే సత్యవతి ఇంట్లోనే ఉన్నాడు.

సత్యవతి మంచంమీద పడుకుంది. చలపతి చిన్న స్టూలుమీద కూర్చున్నాడు.

'సత్యా! ఎన్నాళ్ళనుంచి యిలాగ ఉంది? నాతో ముందుగా యెందుకు చెప్పలేదు?' చలపతి ముఖం విచారంగా ఉంది.

'అన్నీ నీ కెందుకని చెప్పాలి? నువ్వెవరివి అసలు?' సత్యవతి తీక్షణంగా అంది.

'బండి తీసుకునివస్తాను. డాక్టరు దగ్గర కెళ్దాం.'

'నేను రాను.'

'పోనీ డాక్టరు నిక్కడికే తీసుకుని వస్తాను.'

'చెప్పుచ్చుకుని కొడతాను ఎలావస్తాడో?'

'ఏమిటా మొండితనం? చెప్పినమాట విను.' చలపతి కొంచెం కోపంగా అన్నాడు.

'ఏమిటి చలపతీ! పెద్ద రాద్ధాంతం చేస్తావు. రెండురోజులు భోజనం చేయకపోతే ఎవరికయినా పడుతుంది రక్తం నోట్లోనుంచి. ఇప్పటి జబ్బు కాదిది.'

సత్యవతి వాక్యం పూర్తి చేయకుండా తనుచేసిన తప్పు తెలుసుకుని నాలిక కొరుక్కుంది.

చలపతి హృదయం బాధగా మూలిగింది. 'అయితే అదన్నమాట అసలు కారణం. నేనేమయ్యాను? చచ్చాననుకున్నావా?' మెల్లిగా అడిగాడు.

'అదేం కాదు. నోరుజారింది. ప్రొద్దున్న మాత్రం అన్నం తినలేదు ఆకలిలేక అంతే.' సత్యవతి తప్పు దిద్దుకోడానికి విశ్వప్రయత్నం చేసింది.

చలపతి తలవంచుకుని మాట్లాడకుండా కూర్చున్నాడు.

'నిజం చలపతీ! నాదగ్గర డబ్బులేక కాదు. నిన్నే అడిగి ఉందునుగా.'

'సరే అయితే! ఇప్పుడు ఇక్కడే భోజనం చేస్తాను. వండిపెట్టు.' చలపతి తలయెత్తి నిష్ఠూరంగా అన్నాడు.

ఉలికిపోయింది సత్యవతి. నాకిప్పుడు నీరసంగా ఉంది. అయినా నీ భార్య




ఆగండి!

మీ గుడ్డల ఖర్చు ఎక్కువై పోతున్నదా?

అయితే ట్విన్ టస్కర్ గురించి మీరు చేసిన దీర్ఘాలోచనకి ఇది తగ్గిన సమయం అన్నమాట! ఈ వస్త్రాలలోని వైవిధ్యాన్ని మీరు ఇష్టపడతారు .. మధుర మిల్స్ వారి భారీ ఉత్పత్తి అవకాశముంతటితో కట్టితనము, ఎక్కువకాలం మన్నిక, అద్భుతమైన పనితనము, సరసమైన ధర విక్రయము సాధ్య పడినవి. జ్ఞాపకముంచుకోవండి. సరసమైన ధరకు లభించే నాణ్యతకు ట్విన్‌టస్కర్!

మధుర మిల్స్ కంపెనీ లిమిటెడ్, మదురై
మేనేజింగ్ ఏజంట్లు: ఎ & ఎఫ్ హార్వే లిమిటెడ్

హార్వే

ట్విన్ టస్కర్

పాప్లిన్ • డ్రిల్ • లాంగ్‌క్లాత్

సరసమైన ధరకు నాణ్యత!

మదురకు చేరిన హార్వేస్

తిరుగు చూస్తూ ఉంటుంది. యింటికెళ్ళు!

'సత్యా! నే వొకటి చెప్తాను చేస్తావా?' చలపతి సత్యవతి నుదిటిమీద చేయి ఉంచి చూసాడు కాలిపోతోంది.

'నేను నీ మాట వినను.' సత్యవతి ప్రక్కకి తిరిగి పడుకుంది.

'మరి యీ ఊరికి యెందుకు వచ్చావు?' చలపతి కోప్పడ్డాడు.

'బుద్ధిలేక. యింతకు ముందే చెప్పాను. యీ క్షణాన వెళ్లిపోతాను. పంపించెయ్యి.' సత్యవతి కళ్లల్లో నీళ్లు నిండాయి.

'అలాకాదు సత్యా! యిప్పుడు మా యింటికి వచ్చెయ్యి. రెండు రోజులు మామూలుగా ఉన్నావంటే నీ ఆరోగ్యం చక్కబడుతుంది. అప్పుడు నీవు కోరిన చోటికి పంపిస్తాను. ఒక క్షణం యీ ఊర్లో ఉండక్కరలేదు. ఈ ఒక్కసారి నేను చెప్పినట్లు చెయ్యి.' చలపతి ప్రాధేయపడ్డాడు.

'నువ్వు పిచ్చివాడివి. యిప్పటికి పుట్టిన కథలు చాలవనా? జనం అంతా నా ముఖం మీద చెప్పుకుంటున్నారు. నేడో రేపో యింటివాడు కూడా వస్తాడు ఖాళీ చెయ్యమంటూ.' సత్యవతి నీరసంగా అంది.

'చెప్పుకోనీ. అందరినీ గంగలో దూకమను. నాకు లెక్కలేదు.'

'మీ ఊర్లో లేదుగా దూకడానికి.' సత్యవతి పిచ్చిగా విరగబడి నవ్వింది.

'ఏమిటా నవ్వు?' చలపతి కోపంతో నిస్సహాయత ధ్వనించింది.

'నువ్వు ముందు యింటికెళ్లు. యింకొక్క నిముషం కూడా...' సత్యవతి మాట పూర్తి చేసేలోగా దగ్గుతెర అడ్డం వచ్చి మెలికలు తిరిగింది.

చలపతి పట్టుకున్నాడు. సత్యవతి నీరసంగా విదిలించేంది. మంచం ప్రక్కనే వమనం చేసుకుంది. రక్తం చూసి చలపతి బెజారెత్తిపోయాడు. మెల్లిగా పట్టుకుని పడుకోబెట్టాడు. సత్యవతి స్పృహలేని దానిలా పడుకుంది కనులు మూసుకుని.

'యేమిటి చేయడం యిప్పుడు?' చలపతికి మతిపోయింది.

యింట్లోనుంచి నీళ్లు తీసుకువచ్చి శుభ్రం చేసాడు. రుమాలు తడిపి నుదుటిమీద వేశాడు. 'గొంతుకలో పోయడానికి కనీసం పాలుకూడా లేవు. చుట్టుప్రక్కల యెవరినయినా సహాయం తీసుకువస్తే! ఛీ!

# పథ విహీన

వద్దు. అందరూ రాక్షసులు! బ్రతికి ఉన్న వాళ్ళనే చంపేస్తారు. సత్యవతికి స్పృహవస్తే తనేదయినా చేయవచ్చు. బలవంతంగానయినా యింటికి తీసుకుపోవాలి.' చలపతి ప్రక్కనే కూర్చున్నాడు.

ఎప్పుడో పది గంటల తరువాత కనులు తెరచింది సత్యవతి. చలపతి వంగి చూసాడు.

'టైమెంతవుతుంది? నువ్వెళ్లిపో చలపతీ! ప్రొద్దున్న రా.' సత్యవతి నీరసంగా అంది.

'నిన్ను యిక్కడ నుంచి నాతో తీసుకుని కాని వెళ్లను.' చలపతి పట్టుదలగా అన్నాడు.

'నేనేమి యింతలో చచ్చిపోనులే. యింకొక్క క్షణంలో యిక్కడినుంచి వెళ్లకపోతే...' సత్యవతి అంతనీరసంలోనూ కోపంతో లేచి మంచంపట్టి కేసి తలబాదుకుంది.

చలపతి గాభరాగా అడుగు ముందుకు వేసాడు పట్టుకోడానికి.

'ఫో ముందు.' సత్యవతి మరింతగా కొట్టుకుంది. నుదురు చిట్లింది.

చలపతి బాధపడ్డాడు 'మొండిది. ఏం చెప్పినా వినదు. సత్యవతిని గట్టిగా పట్టుకుని తల తలగడా మీదికి వాల్చాడు.

'సరే! నీమాటకాని ప్రొద్దున్నే వస్తాను. మంచంమీదనుంచి లేవకు. నేనింటికి వెళ్లి ఎవరయినా మనిషిని నీకు సాయంగా పంపిస్తాను.' యేమీ చెయ్యలేక అన్నాడు.

సత్యవతి దీర్ఘంగా నిశ్వసిస్తూ పడుకుంది తలకూడా కదల్చకుండా. చలపతి తలుపుదగ్గరగా లాగి చీకటిలోకి నడిచాడు.

* * *

'సీతా!'

'సీతా!' చెవిలోపడ్డ అస్పష్టమయిన పిలుపుకి కళ్లు తెరచింది సీత! చలపతి మీదకి వంగిచూస్తూ కనపడ్డాడు. గభాలున లేచింది.

'ఇప్పుడే వచ్చారా?'

ఊఁ. నువ్వింకా భోజనం చేయలేదా? నాకోసం యెదురుచూస్తూ ఉన్నావనుకుంటాను.'

'రండి చేద్దాం.' సీత నడవబోయింది.

'లేదు సీతా! నా మనసు బాగాలేదు. యిప్పుడు భోజనంచేయలేను. నువ్వు చేసిరా. అందుకే లేపాను.' చలపతి అన్నాడు.

సీత ఆశ్చర్యపోయింది. 'బహుశ అక్కడ చేసారేమో! తనతో చెప్పడం ఇష్టంలేక అలా అని ఉండవచ్చు. యింత రాత్రి వరకూ అక్కడే ఉన్నారన్నమాట. నిజం ఎంతున్నా లేకపోయినా యింతరాత్రి అక్కడ చూసారంటే ప్రజలు అనుకున్నారంటే తప్పేముంది? ఆయనతో చెప్పకతప్పదు.' సీత మనసులో అనుకుంది.

'ఏమిటి సీతా! ఆలోచిస్తున్నావు. ఆలస్యమయిపోయింది. భోజనం చేసిరా.' చలపతి అన్నాడు.

సీత ఒక క్షణం సందేహించి మౌనంగా నిలచింది. 'ఎలాగ చెప్పాలి?'

'ఏమండీ! ఆవిడకి కొంచెం దూరంగా ఉండడానికి ప్రయత్నించకూడదూ, అందరూ...' ఆమె పూర్తి చేయలేదు.

'సీతా!' చలపతి భార్య భుజాలు పట్టుకున్నాడు.' నీకు కూడా నామీద నమ్మకం పోయిందా చివరకి?' మెల్లిగా బాధతో అడిగాడు.

'లేదు. లేదు. నా కసలు అద్దేశ్యంలేదు. అందరూ మీ గురించి చెప్పుకుంటూ ఉంటే సహించలేక చెప్పాను.' సీత భర్త దగ్గరగా జరిగి భుజం మీద తల ఆన్చింది.

'సీతా! ఒకప్పుడు నీవే ఆమె యెవరని అడిగితే నేను చెప్పలేక పోయాను. యిప్పుడు చెప్పవలసిన అవసరం యేర్పడింది. కూర్చో.' చలపతి భార్యను మంచం మీద కూర్చోబెట్టాడు.

'లేదు. నాకేమీ చెప్పొద్దు. అవసరం లేదు. నాకు మీమీద నమ్మకం ఉంది నన్ను నమ్మండి.' సీత కంగారుగా భర్త తన మాటలు మరోలా అర్థం చేసుకున్నాడేమోనని బాధతో అంది.

'ఆ నమ్మకం నిలబెట్టుకోవలసిన బాధ్యత నా మీద కూడా ఉందిగా. అయినా మనిద్దరి మధ్య అగాధం యేర్పడటానికి అవకాశం యివ్వడం నాకు యిష్టంలేదు సీతా! ఆమె పేరు సత్యవతి. మేము చిన్నప్పుడు సుమారు పదిహేనేళ్ళు కలిసి పెరిగాం. ఆమె వయసులో నా కంటె ఒక సంవత్సరమే పెద్ద. ఆమె జీవితంలో మోసగింపబడింది. ఆమె కనులు తెరచేసరికి

సర్వస్వం హరింపబడి ఒట్టి స్త్రీగా, యేకాకిగా ప్రపంచంలో నిలబడింది. బంధువులందరూ ఆమెను దూరం చేసారు. సంఘం తన నీడలోకి చేర్చుకోడానికి నిరాకరించింది. పెంచిన కూతురు పదేళ్ళ క్రితం చనిపోయింది. అటువంటి పరిస్థితిలో ఆమె నాకు కనపడి నాతో వచ్చింది సీతా! అంతకు మించి నేనేం చెప్పలేను' చలపతి భారంగా అన్నాడు.

'ఈ ఊరిలో నా యిద్దర గురించి చెప్పుకుంటున్నారనే భయంతోనే యీనాడు అక్కడి నుంచి నన్ను తరిమి వేసింది సీతా! యిప్పుడామె పరిస్థితిలో మరెవరున్నా నేను రాత్రి వదలి వచ్చేవాడిని కాను.' చలపతి విచారంగా వివరించి చెప్పాడు.

'యివారు నాకు ముందే చెప్పి ఉండవలసింది.' సీత భర్తతో అంది. చిన్న కథ ఆమె హృదయంలో నాటుకుంది.

'అప్పుడు సీతా! అనవసరంగా లేనిపోని అనుమానాలకి తావిచ్చాను.'

'నాన్నా!' బయట నుంచి రాజా పిలిచాడు.

చలపతి బయటకు నడిచాడు.

'నాగరత్నం యింట్లో లేదు నాన్నగారూ.' రాజా అన్నాడు.

'ఎందుకు?' సీత అడిగింది.

'సత్యవతి యింటికి సహాయంగా పంపుదామనుకున్నాను సీతా! యిక్కడిది నసేమిలా రానంది. పోనీ నేనక్కడ ఉంటే తల పగుల కొట్టుకుని చస్తానంది.' చలపతి బాధగా అన్నాడు.

'రండి. యిక్కడికి ఎలాగయినా తీసుకు వద్దాం. నేను ఒప్పించగలను.' సీత సానుకంపంగా భర్తవైపు చూసింది.

చలపతి చెప్పులు వేసుకున్నాడు.

'రాజా! వీరన్న యింటికెళ్ళి బండి కట్టించుకునిరా. మేము ముందు వెళ్తాం.' సీత చలపతి వెంటవీధిలోకి దారితీసింది.

యిద్దరూ వెళ్ళేసరికి యిల్లు ఖాళీగా ఉంది. తలుపులు దగ్గరగావేసి ఉన్నాయి. సత్యవతి జాడలేదు. చలపతి నుదుటిమీద కొట్టుకున్నాడు.

'ఎక్కడికయినా వెళ్ళిపోయిందేమో! సీతా!' చలపతి విచారంగా అన్నాడు.

మంచం పట్టెమీద ఒక మడచిన కాగితం కనపడింది. చలపతి విప్పిచూసి పూర్తిగా చదువకుండానే జేబులో పెట్టుకున్నాడు.

'సీతా నేను స్టేషనుకి వెళ్తాను. త్వరగా వెళ్తే దొరుకుతుందేమో? రాజా వస్తాడు. వాడిని బస్‌స్టాండ్‌కి వెళ్ళి చూసిరమ్మను. నువ్వు బండెక్కి యింటికి వెళ్ళిపో.' చలపతి కంగారుగా వీధిలోకి సాగిపోయాడు.

సీత దీర్ఘంగా నిట్టూర్చింది.

రాత్రి ఒంటిగంటకు చలపతి యింటికి చేరాడు నీరసంగా. సీత వీధిలోనే యెదురు చూస్తూ కూర్చుంది.

'రాజా వచ్చాడా? నేను వెళ్ళేముందే ఎక్స్‌ప్రెస్ వెళ్ళిపోయింది సీతా! అందులో వెళ్ళి ఉండవచ్చు అన్నాడు స్టేషన్‌మాస్టరు. చలపతి భారంగా చెప్పాడు.

'బస్ స్టాండ్‌లో ఎవరూ లేరట. రాత్రిళ్ళ బస్‌లు ఏవీ లేవుగా అయినా.'

సీత అంది.

చలపతి యింట్లోకి దారితీసాడు.

'సీతా! సత్యవతి అంటే నాకు యిష్టం. ఆ వ్యక్తిలో యే విధమయిన ఆకర్షణ ఉందో నాకు తెలియదు. ఆ ప్రేమకు అన్నాచెల్లెళ్ళ ప్రేమ అని మరొకటి అని రంగు పూయలేను. నేను చెప్పలేనుకూడా. ఒకవిధమయిన అనుబంధం నిర్వచనానికి అందదు. మానవధర్మంగా ఏదో సహాయం చేద్దామని అనుకున్నాను. నాకు ఏదో చెడ్డ పేరు వస్తుందేమోనని భయపడి పారిపోయింది ఆ పిచ్చి మనిషి. అభాగ్యురాలు ఎక్కడుందో యేమో!' చలపతి జేబులో సత్యవతి వ్రాసిన కాగితం భార్య చేతిలో పెట్టాడు.

సీత లాంతరు దగ్గరికి తీసుకు వెళ్ళి చదివింది.


చలపతీ!

నీకు తెలియపరచకుండా వెళ్తున్న యీ కృతఘ్నురాలిని నీవు క్షమించగలవని అనుకుంటే అదృష్టవంతురాలిని. నీవు నడిచే బాట వేరు. నాకు నిర్దేశింపబడినది మరొకటి. నన్ను నీ బాటలోనికి సంఘం రానీయదు. నిన్ను నా దగ్గరికి నేను రానీయను. నా కల్మషం యిప్పటికే నీకు అంటింది. ఆ రోజు రైలులో నీ ముఖం చూసి, ప్రేమాప్యాయతలకి ముఖం వాచి పిచ్చిగా నీ వెంట వచ్చేసి అనుక్షణం బాధపడ్డాను. నిన్ను బాధపెట్టాను. నీవు చూపించే ప్రేమానురాగాలకు నేనర్హురాలిని కానని అనిపించింది. అందుకనే వెళ్ళిపోతున్నాను. ఈ దురదృష్టవంతురాలిని మరచిపో. చనిపోయేలోగా యింకొకసారిమాత్రం నిన్ను చూడాలని కోరుకుంటూను చలపతీ! నా కోరిక నెరవేరుతుందో లేదో చూడాలి.

నీకు యేమీకాని

సత్యవతి

సీత కంటినుండి జారిన ఒక బిందువు సత్యవతిపేరు మీదపడి అక్షరాలు చెదిరి పోయాయి.



పెళ్లి 'ఎప్పుడో' అయిపోయింది — ఇక 'బిల్లే' అపండేమ్!